6 న గద్దర్ వర్ధంతి కార్యక్రమం

బడంగ్‌పేట,జూలై 25: ప్రజా యుద్ధనౌక, ప్రజా గాయకుడు గద్దరన్న ప్రథమ వర్ధంతి కార్యక్రమం ఆగస్టు 6న రవీంద్ర భారతిలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతుందని అణగారిన హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. గద్దర్ అభిమాన సంఘాలు, కళాకారులు, రచయితలు, కవులు, ప్రజా సంఘాలు, దళిత బహుజన సంఘాలు, కుల సంఘాల నాయకులు పాల్గొని గద్దర్‌కు నివాళులర్పించాలని ఆయన కోరారు. గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గద్దర్ త్యాగాలపైన పాటలు, ఆటలు, నాటికలు ఉంటాయన్నారు.

విరిగిన చెట్టు.. ఆటో ధ్వంసం

వనస్థలిపురం, జూలై 25 : ఆగకుండా కురుస్తున్న వర్షాలతో బీఎన్ రెడ్డినగర్ చౌరస్తా ఆటో స్టాండ్‌లో ఉన్న పెద్ద వృక్షం కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో చెట్టు కింద ఉన్న ఓ ఆటోతో పాటు పలు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి డీఆర్ఎఫ్ సిబ్బందిని పిలిపించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని కొమ్మలను తొలగించారు. ఆటో పై భాగం ధ్వంసం కావడంతో తనను ఆదుకోవాలని ఆటో డ్రైవర్ ప్రభుత్వాన్ని కోరాడు.

దుప్పట్లు పంపిణీ

ఉప్పల్, జూలై 25: తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో నాచారంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేటీఆర్ జన్మదినం పురస్కరించుకొని పేదలకు, కార్మికులకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, స్వామి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగరావవు, లక్ష్మణ్, సుధాకర్, రాజు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వనస్థలిపురం, జూలై 25 : ఎడతెరిపిలేని వర్షాల కారణంగా పిల్లల ఆరోగ్యం పై అప్రమత్తంగా ఉండాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సూచించారు. గురువారం సాహెబ్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో జపనీస్ ఎన్కఫలైటీస్ వ్యాక్సిన్‌ను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు సీజనల్ వ్యాధిన బారిన పడకుండా వ్యాక్సిన్ సహకరిస్తుందన్నారు. తల్లిదండ్రులు పిల్లల పై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. 9 నెలల నుంచి 15 సంవత్సరాల వయసు వారికి దీనిని అందజేయడం జరుగుతుందన్నారు. ఇళ్లలో దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణలో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, ప్రధానోపాధ్యాయులు దినేశ్, రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు టీకాలు...

సైదాబాద్: సైదాబాద్ డివిజన్ పరిధిలోని శంకేశ్వరబ జార్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బ్రెయిన్ ఫీవర్ (జేసీ వ్యాక్సినేషన్) టీకా కార్య క్రమాన్ని గురువారం సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులు తమ ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ బ్రెయిన్ ఫీవర్ వ్యాక్సినేషన్ టీకాలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుకన్య, చంద్రయ్య, కవిత, ఆశ వర్కర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి...

ఆర్కేపురం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు చిలుకా ఉపేందర్‌రెడ్డి అన్నారు. గురువారం జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం సిబ్బంది, కాలనీ వాసులతో కలిసి ఉపేందర్‌రెడ్డి ఎన్టీఆర్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలకు డెంగ్యూ, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న సందర్భంగా ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రజలు కాలనీ పరిసరాలతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. దోమల బెడద తలెత్తకుండా అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు మందులను పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సిబ్బంది నర్సింహ, రాంబాబు, రాజు, ఎన్టీఆర్‌నగర్ ఫేస్-2 అధ్యక్షుడు రవి, కార్యదర్శి నాగరాజు, లక్ష్మణ్, వంగాల శ్రీకాంత్‌రెడ్డి, రాజు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



సాహెబ్‌నగర్ స్కూల్లో వ్యాక్సిన్‌ను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

విద్యార్థులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

ఎన్టీఆర్‌నగర్‌లో ఎంటమాలజీ సిబ్బందితో ఉపేందర్‌రెడ్డి

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మలక్‌పేట, జూలై 25: నాణ్యమైన, ఖరీదైన గుండె వైద్యాన్ని నిరుపేదలకు ఉచితంగా అందించగలిగినపుడే సమాజంలో వైద్యులు రాణించగలుగుతారని కేర్ ఆసుపత్రి గుండె వైద్య నిపుణులు డాక్టర్ శ్రవణ్‌కుమార్ అన్నారు. చాదర్‌ఘాట్‌లోని కేర్ ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కేర్ ఆసుపత్రి గుండె వైద్య నిపుణులు డాక్టర్ శ్రవణ్‌కుమార్, మిధాని హెల్త్ కేర్ సెంటర్ డాక్టర్ వీర రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో వైద్యులు గుండె వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, బ్లడ్ షుగర్, ఈసీజీ, 2డీ ఈకో, డయాబెటీస్ తదితర పరీక్షలు నిర్వహించారు. కొందరు గుండె సంబంధిత వ్యాధులతో తీవ్రంగా బాధపడుతున్నారని, తెల్ల రేషన్‌కార్డు వారితోపాటు మరికొందరికి మలక్‌పేటలోని కేర్ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషనన్లు చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ గుండెకు చిన్న సమస్య వచ్చినాలయ తడబడుతుందని, ఛాతిలో నొప్పి రాగానే గుండె నొప్పి అని భావించలేమని, కాని వయస్సు పెరుగుతున్న కొద్ది గుండెకు సంబంధించిన సమస్యలు ఏమున్నాయో తెలుసుకోవడానికి ప్రయత్నించాలని సూచించారు. ఆహార నియమాలు పాటించాలని, దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈసీజీ, ఈకో ట్రేడ్మిల్ పరీక్షలతో రక్త సరఫరాలో పూడికలుంటే తెలిసిపోతాయని, ట్రోపనిన్ పరీక్షతో నొప్పి ఎందుకు వస్తుందని తెలుసుకోవచ్చునన్నారు. కాగా ఈ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న గుండె వైద్య నిపుణులు

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

సైదాబాద్, జూలై 25 : పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మలక్‌పేట నియోజకవర్గానికి చెందిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పాతబస్తీలోని ఫంజేషాలోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు అనారోగ్య సమస్యలను పరిష్కరించుకోవటానికి ప్రభుత్వం ఇచ్చే సీఎం సహాయం నిధి ద్వారా అందజేసే సహాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన వారందరికీ సీఎం సహాయ నిధి చెక్కులను మంజూరు చేయించటానికి తగిన చర్యలు తీసుకుంటానని, 24 మందికి రూ.10, 68,500 లక్షల విలువైన చెక్కులను అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరుణోదయ కుమార్‌కు వీడ్కోలు

పీపీ అరుణోదయ కుమార్‌ను సన్మానిస్తున్న మెజిస్ట్రేట్ సల్మా ఫాతిమా

హయత్‌నగర్, జూలై 25: హయత్‌నగర్ కోర్టులో బదిలీపై వెళ్తున్న ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరుణోదయ కుమార్‌కు 14వ అదనపు మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ సల్మా ఫాతిమా, 7వ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నూతన్, హయత్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భిక్షపతి గౌడ్, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువా కప్పి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ సల్మా ఫాతిమా, ఏపీపీ నూతన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భిక్షపతిగౌడ్ మాట్లాడుతూ హయత్‌నగర్ కోర్టులో పీపీ అరుణోదయ కుమార్ నిరుపేదలకు ఎల్లవేళలా న్యాయ సలహాలు, సూచనలు అందించారని కొనియాడారు. సీనియర్, జూనియర్ అడ్వకేట్లకు పలు సలహాలు, సూచనలు చేస్తూ నిజాయితీ, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్‌ల సిబ్బంది, సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ తాత్కాలిక పర్సన్ ఇన్‌చార్జిగా పద్మహర్ష

మలక్‌పేట, జూలై 25: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ తాత్కాలిక పర్సన్ ఇన్‌చార్జిగా రాష్ట్ర అగ్రికల్చరల్ మార్కెటింగ్ డైరెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పద్మహర్షను నియమించారు. గురువారం ఆమె మలక్‌పేటలోని మార్కెట్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

మోడల్ స్కూల్‌కు వెళ్లే రోడ్డును మెరుగుపర్చాలి

కందుకూరు, జూలై 25 : మండల పరిధిలోని నేదునూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలతో పాటు మోడల్ స్కూల్ వెళ్లే రహదారిని మెరుగు పర్చాలని వందేమాతరం విద్యార్థి సేవా ఫోర్సు అధ్యక్షుడు ,మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి ఊటు మహేందర్ గురువారం కలెక్టర్ శశాంక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి మోడల్ స్కూల్‌కు విద్యార్థులు వస్తారని ఈ రోడ్డు వసతి సక్రమంగా లేక అవస్థలు పడుతున్నారని, చిన్నపాటి వర్షం వచ్చిన చిత్తడిగా మారుతుందని, బురదలో వెళ్లడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అలాగే బస్సుల సౌకర్యం, పాఠశాలతో పాటు మోడల్ స్కూల్ వసతులు కల్పించాలని ఆయనను కోరారు. దీంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించి రోడ్డు సౌకర్యంతో పాటు అన్ని వసతులను కల్పిచడానికి కృషి చేస్తానని తెలిపారని పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు పుచ్చల విష్ణు,రమేశ్ పాల్గొన్నారు.

కలెక్టర్ శంశాంక్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహేందర్

బాలాపూర్‌లో ఘనంగా బోనాలు

ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మేయర్ చిగిరింత పారిజాత

బడంగ్‌పేట, జూలై25: బాలాపూర్, మల్లాపూర్‌లో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనాలను సమర్పించారు. డప్పు దరువులు, శివసత్తుల ఆటపాటలు, తీన్మార్ స్టెప్పులతో యువత అదరహో అనిపించారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, ఎర్ర మహేశ్వరి జైయింద్, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు డీసీపీకి ఆహ్వానం

సౌత్ ఈస్ట్ డీసీపీ కాంతిలాల్ పాటిల్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సుధీర్, బాబురావు

మాదన్నపేట, జూలై 25: మాదన్నపేటలో ఆదివారం నిర్వహించే బోనాల ఉత్సవాలలో పాల్గొనాలని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ పాటిల్‌కు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆదివారం బోనాలు సోమవారం ఘటాల ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్‌గా తంగెళ్ల సుధీర్ తెలిపారు. వైస్ చైర్మన్‌గా నింబోలి బాబు రావు, ప్రేమ్‌కుమార్,జనపాల మధు,కోశాధికారిగా గుంటి దరమ్‌కుమార్,తత్తరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

28న బోనాలు ఉత్సవాలు

మన్సూరాబాద్, జూలై 25: మన్సూరాబాద్‌లో ఈ నెల 28న బోనాల ఉత్సవాలను నిర్వహించనున్నారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీసాయినగర్ కాలనీ శ్రీదుర్గాదేవి దేవాలయం కమిటీ చైర్మన్ పోచబోయిన గణేశ్ యాదవ్ ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు శ్రీదుర్గాదేవి దేవాలయం నుంచి పోతరాజు విన్యాసాలు, డప్పు వాయిద్యాల మధ్య ర్యాలీగా బయలుదేరి సీఆర్ ఎన్‌క్లేవ్‌లోని పోచమ్మ దేవాలయానికి చేరుకుంటారు. పోచమ్మ దేవాలయ కమిటీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి పట్టు వస్త్రాలను స్వీకరించి అమ్మవారికి సమర్పించనున్నారు.

రాష్ట్ర బడ్జెట్ అన్ని వర్గాలకు అన్యాయం

ప్రకాశ్‌రెడ్డి

కందుకూరు, జూలై 25 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు అన్యాయమం జరిగిం దని మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్ రెడ్డి తెలిపారు. అంకెల గారడి తప్పితే ఏ వర్గానికి మేలు జరిగే విధంగా లేదని ఆయన తెలిపారు. బడ్జెట్‌ను చూస్తే యావత్ తెలంగాణ ప్రజలకు అన్యాయం జరిగినట్లు స్పష్టం అవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. ప్రజల చీత్కారానికి గురికాక తప్పదని తెలిపారు. బడ్జెట్‌ను చూస్తే కాం గ్రెస్ నిజస్వరూపం బయటపడిందన్నారు.

ఇంటింటికీ పోస్ట్‌బాక్స్ అభినందనీయం

చంపాపేట, జూలై 25: స్థానిక ఉత్పత్తుల కేంద్రం ఎల్‌పీడీఓ ద్వారా ఇంటింటికీ పోస్ట్ బాక్స్ అనే నినాదాన్ని తీసుకు వెళ్లే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని చంపాపేట సబ్ రిజిస్ట్రార్ మధుబాబు అన్నారు. గురువారం స్థానిక ఉత్పత్తుల కేంద్రం అధ్యక్షుడు భరత్ సంఘం ఆధ్వర్యంలో పోస్ట్‌మాస్టర్ నరేందర్ వెళ్లి, చంపాపేట సబ్ రిజిస్ట్రార్ మధుబాబును కలిసి పోస్ట్‌బాక్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ మధుబాబు మాట్లాడుతూ.. స్థానిక ఉత్పత్తుల కేంద్రం అధ్యక్షుడు భరత్ సంఘం విధిగా నిర్వహిస్తున్న ఇంటింటికీ పోస్ట్‌బాక్స్ అనే కార్యాచరణ ప్రతి ఒక్కరికీ వర్తిస్తుందన్నారు. ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పోస్టుబాక్స్‌ల ద్వారా మంచి సత్సంబంధాలు మెరుగు పడుతాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు ఇంటింటికీ పోస్ట్‌బాక్స్ అనే నినాదం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఇంటిముందు పోస్ట్‌బాక్స్‌ను ఏర్పాటు చేయడం వల్ల లెటర్లు అందులో వేస్తుంటారని వారు అన్నారు. ఈ సందర్భంగా భరత్ సంఘాన్ని సబ్ రిజిస్ట్రార్ ప్రత్యేకంగా అభిమానించారు.

సబ్‌రిజిస్ట్రార్ మధు బాబుకు పోస్ట్ బాక్స్‌ను అందజేస్తున్న స్థానిక ఉత్పత్తుల కేంద్రం అధ్యక్షుడు భరత్ సంఘం

బదిలీపై వెళ్తున్న జలమండలి డీజీఎం సరితకు సత్కారం

చంపాపేట, జూలై 25: ప్రభుత్వ ఉద్యోగులకు స్థాన చలనం సహజమేనని కాంగ్రెస్ పార్టీ జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఉద్యోగుల బదిలీలో భాగంగా ఎల్బీనగర్ జలమండలి డీజీఎం సరిత ఇటీవల ఎల్బీనగర్ నుంచి బదిలీపై మీర్‌పేట జలమండలి డీజీఎంగా వెళ్లనున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి గురువారం ఎల్బీనగర్ జలమండలి కార్యాలయంలో ఆమెను కలిసి శాలువాతో సత్కరించి గణపతి ప్రతిమను గిఫ్ట్‌గా అందజేశారు. ఇన్నాళ్లుగా ఈ ప్రాంత వాసులకు సేవలందించినందుకుగాను అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎల్బీనగర్ జలమండలి డీజీఎంగా 6 సంవత్సరాలు బాధ్యతలు నిర్వర్తించి ఈ ప్రాంత వాసుల మన్ననలు పొందారని తెలిపారు. వాటర్ వర్క్స్ ఏఈ పవిత్ర, నాయకులు రాజు, ప్రవీణ్‌రెడ్డి, రోహిత్, కరణ్‌కుమార్, నరేందర్, ఉమేశ్‌గౌడ్, నరేశ్ పాల్గొన్నారు.

రేపు కంఠమహేశ్వర స్వామి బోనాలు

మన్సూరాబాద్, జూలై 25: మన్సూరాబాద్ శ్రీ కంఠమహేశ్వర స్వామి బోనాల ఉత్సవాలను శనివారం నిర్వహించనున్నట్లు మన్సూరాబాద్ గౌడ సహకార సంఘం అధ్యక్షుడు, కంఠమహేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి శ్రీధర్‌గౌడ్ తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ తదితరులు హాజరై పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయింపుపై హర్షం

అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న టీ పీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్

మలక్‌పేట, జూలై 25: రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎస్సీ కార్పొరేషన్‌కు ప్రత్యేక నిధులు కేటాయించటం పై హర్షం వ్యక్తం చేస్తూ టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్ బోనగిరి చంద్రశేఖర్, మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్టుపాక ప్రభాకర్, నాయకుడు ముప్పిడి ధన్వంత్ మూసారాంబాగ్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్‌కు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించటం చాలా సంతోషంగా ఉందని, ఈ నిధులను పూర్తి స్థాయిలో ఎస్సీల సంక్షేమానికే వినియోగించాలని కోరారు.

మూసారాంబాగ్‌లో వాటర్ వర్క్స్ క్వాలిటీ అష్యూరెన్స్ టీం పర్యటన

మలక్‌పేట, జూలై 25: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గురువారం వాటర్ వర్క్స్ క్వాలిటీ అష్యూరెన్స్ టీం సభ్యులు మూసారాంబాగ్ డివిజన్‌లోని పలు బస్తీల్లో పర్యటించారు. వాటర్ వర్క్స్ క్వాలిటీ మేనేజర్ శ్రీనివాస్, మూసారాంబాగ్ మేనేజర్ వెంకటేశ్, టెక్నికల్ అధికారి అహ్మద్ పాషా తదితరులు ఫ్రెండ్స్ కాలనీ వడ్డెర బస్తీ, వాంబే బస్తీ, అంబేద్కర్ బస్తీల్లో పర్యటించి నీటి నాణ్యతను పరిశీలించారు. వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున నీటిలో క్రిమి కీటకాలు ఎక్కువగా ఉత్పత్తి అవుతున్నాయని బస్తీవాసులకు వివరించారు. నీటి పరిశుభ్రత, నాణ్యత, క్లోరిన్ గుళికలను వాడే విధానం, వాటి ఉపయోగాలు తదితర అంశాలపై బస్తీ వాసులకు అవగాహన కల్పించి పంపిణీ చేశారు. నాయకులు బొక్క మధుసూదన్‌రెడ్డి, శివరాం తదితరులు పాల్గొన్నారు.



క్లోరిన్ గుళికలను పంపిణీ చేస్తున్న వాటర్ వర్క్స్‌క్వాలిటీ మేనేజర్ శ్రీనివాస్

దెబ్బ తిన్న రహదారులకు మరమ్మతులు

శివారు కాలనీల్లో రహదారుల మరమ్మతులు చేయిస్తున్న మనోజ్‌కుమార్

వనస్థలిపురం, జూలై 25 : ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఉపాధ్యక్షుడు గౌరిశెట్టి మనోజ్ గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్‌లోని తూర్పు కాలనీల్లో దెబ్బ తిన్న రహదారులకు సొంత ఖర్చులతో మరమ్మతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ వరుసగా కురుస్తున్న వర్షాలతో శివారులో ఉన్న తూర్పు కాలనీల్లో అంతర్గత రహదారులు దెబ్బతిన్నాయన్నారు. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుంతల రోడ్లలో నీరు చేరి బురదగా మారుతుందన్నారు. దీంతో ఈ నెల 27న ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని 25, 26, 27 తేదీల్లో గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అన్ని కాలనీల్లో మరమ్మతులు పూర్తి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో నాలా, డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయన్నారు.